క్లుప్తంగా

ఘనంగా గుడివాడ అప్పన్న వర్ధంతి


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

అక్కిరెడ్డిపాలెం: పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ గుడివాడ అప్పన్న వర్ధంతిని 68వ వార్డు మిందిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మిందిలోని అప్పన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుడివాడ అప్పలరామ్మూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్‌లో అక్కిరెడ్డిపాలెం విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కాంతం, పీడీ ఇస్మాయిల్

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 22, 23వ తేదీల్లో ప్రకాశం జిల్లా పాకాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్న క్యారమ్స్ పోటీలకు 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎంపికైన 10వ తరగతి విద్యార్థినులు జె.ఢిల్లేశ్వరి, సీహెచ్.కుమారి, ఎ.కోమలి, 8వ తరగతి విద్యార్థిని పి.దీక్షిత, 7వ తరగతి విద్యార్థిని బి.అక్షయ, 6వ తరగతి విద్యార్థిని కె.హరిప్రియలను పాఠశాలలో స్కూల్ హెచ్‌ఎం ఎం.ఎ ల్.ఎస్.కాంతం, పీడీ ఇస్మాయిల్‌లు అభినందించారు.

స్కేటింగ్‌లో కేవీ విద్యార్థినులకు పతకాలు


విజేతలను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ వంశీకృష్ణ

ఉక్కునగరం: స్థానిక కేంద్రీయ విద్యాలయం విద్యార్థినులు జాతీయ స్థాయి రోలర్ హాకీ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 5 నుంచి 15 వరకు రోలర్ హాకీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 62వ జాతీయ రోలర్ హాకీ చాంపియన్‌షిప్ -2024 పోటీలు జరిగాయి. పాఠశాలకు చెందిన ప్లస్ 10 విద్యార్థిని డి. ఓజస్విని జూనియర్, 7వ తరగతి విద్యార్థిని ఎం. హర్షిణి సబ్ జూనియర్ కేటగిరీలో కాంస్య పతకాలు గెలుపొందారు. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఈ.వి.ఎల్.ఎన్. వంశీకృష్ణ అభినందించారు.

న్యూపోర్టు సీఐకు అభినందనలు


సీఐ కామేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న నెల్లిముక్కు గ్రామ కమిటీ సభ్యులు

పెదగంట్యాడ: న్యూపోర్టు సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తోటాడ కామేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు గ్రామ కమిటీ సభ్యులు శుక్రవారం సీఐ కామేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, నమ్మి అప్పారావు, పెంటయ్య, రమణ, అప్పలరాజు, అప్పలరెడ్డి, పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

కనిపించలేదా కబ్జా?


బ్యూటిఫికేషన్ ముందు చెరువు ముఖ చిత్రం



ఆక్రమణలు వదిలి ప్రభుత్వ లోగోతో ఏర్పాటు చేసిన బోర్డు

- కృష్ణమహంతి చెరువుకు గర్భశోకం
- ఎకరాలు కొల్లగొట్టిన కబ్జాదారులు
- ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.100 కోట్ల పైమాటే
- పట్టించుకోని అధికారులు

ఒకప్పుడు ఆ చెరువు పంటపొలాలకు సాగు నీరు అందించింది. మూగజీవాల దాహార్తి తీర్చింది. నగరీకరణలో భాగంగా పంటపొలాల్లో నివాస గృహాలు, అపార్ట్‌మెంట్‌లు వచ్చాయి. కాలక్రమేనా పంటల సాగు నిలిచిపోయింది. అక్కడ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇంకేముంది ఆక్రమణదారుల కళ్లు ఆ చెరువుపై పడ్డాయి. పక్కా స్కెచ్‌తో ఆక్రమణకు తెరలేపారు. దర్గాగా రోడ్డు నిర్మించి చెరువును రెండుగా విడగొట్టేశారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా కృష్ణమహంతి చెరువు సుందరీకరణ పనులు చేశారు. హద్దులు నిర్ణయించకుండా బోర్డు ఏర్పాటు చేయడంతో కబ్జా కనిపించలేదా అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి


చెరువు కబ్జాలో భాగంగా కుప్పలుగా పోసిన డెబ్రిస్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 88వ వార్డు నాతయ్యపాలెంలోని కృష్ణమహంతి చెరువు కబ్జాకు గురైంది. అయినా రెవెన్యూ యంత్రాంగంలో చలనం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చెరువును గ్రామంలో కొందరు పెద్దల ముసుగులో ఒక సిండికేట్‌గా ఏర్పడి కబ్జాకు పాల్పడ్డారని వినికిడి. చెరువు అవతలి వైపు ఉన్న వారు రాకపోకలు సాగించడానికి అనే సాకుతో చెరువు మధ్యలో గట్టును ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేశారు. ఆ మార్గం ద్వారా ఏకంగా చెరువును రెండు భాగాలుగా విడగొట్టారు. పూడికలతో చదును చేయడం, డెబ్రిస్ వేసి ఎకరాలకు ఎకరాలు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అయినా రెవెన్యూ అధికారులు చెరువును పరిశీలించిన పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఐదు ఎకరాల వరకూ ఆక్రమణ

ప్రస్తుతం చెరువు 5 ఎకరాలకు పైగా కబ్జాకు గురైందని, దాని విలువ రూ.100 కోట్లకు పైమాటే అంటున్నారు. కనీసం చెరువు విస్తీర్ణం ఎంత ఉంది, ఎంత మిగిలింది, ఎంత కబ్జాకు గురైంది అనే విషయం రెవెన్యూ అధికారులు ఒక్కసారైనా పరిశీలించారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కృష్ణమహంతి చెరువు బ్యూటిఫికేషన్, అభివృద్ధి సమయంలో చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. రూ.2 కోట్లు నిధులతో పనులు చూపి మమా అనిపించేశారు. సుమారు 19 నుంచి 20 ఎకరాలపైగా ఉన్న చెరువు ఇప్పుడు 14 నుంచి 15 ఎకరాలు మాత్రమే ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పుడైనా రెవెన్యూ అధికారులు కృష్ణమహంతి చెరువు సర్వే నిర్వహించి ఆక్రమణగురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.


రామాలయం వెనుక నుంచి చెరువును డెబ్రిస్‌తో కప్పుతున్న దృశ్యం

అధికారులు వస్తే.. అక్రమార్కులకు సమాచారం

ఒకవేళ అధికారులు చెరువు వైపు వస్తున్నారని తెలిస్తే కబ్జాదారులకు కిందస్థాయి సిబ్బంది ద్వారా ముందస్తు సమాచారం రావడంతో వారు అప్రమత్తమై వచ్చిన వారిని మచ్చిక చేసేకుని అటు నుంచి అటే పంపిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కృష్ణమహంతి చెరువుతో పాటు చెరువు స్వరూపంపై కొత్తగా వచ్చిన అధికారులకు అవగాహన లేకపోవడంతో కబ్జాదారుల పంటపండుతుందని చెబుతున్నారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నేడు

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శనివారం 87వ వార్డు పరిధిలో మొక్కలు నాటనున్నామని వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం మొక్కలు నాటి తర్వాత వార్డు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచనున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొవాలని ఆయన కోరారు.

'నష్టపోయిన వారికి ఎక్కువ రిజర్వేషన్ కల్పించాలి'


ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఇప్పటి వరకూ రిజర్వేషన్ ఫలాలు అందుకోవడంలో నష్టపోయిన ఎస్సీ ఉపకులాలకు ఎక్కువ రిజర్వేషన్ కోటా ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దేవరపల్లి సురేష్‌బాబు, లింగాల రవీంద్రబాబు కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు సంఘం తరఫున పలు ప్రతిపాదనలు, సూచనలు అందజేశారు. 2004లో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సుప్రీం కోర్టు రద్దు చేయడం వల్ల 20 ఏళ్లుగా ఎస్సీల్లోని అత్యంత వెనుకబడిన ఉపకులాలు రిజర్వేషన్ ఫలాలకు దూరం అయ్యారన్నారు.
ఉద్యోగుల పదోన్నతులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీతో పాటు ప్రభుత్వం ఎస్సీలకు అందించే సంక్షేమ పథకాల అమల్లో కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని వారు చైర్మన్‌ను కోరారు.

పౌష్టికాహారంతోనే ఎదుగుదల


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

అగనంపూడి: బాల్యంలో పిల్లల శరీరం, మెదడు, ఆలోచనా ధోరణలు ఎదగాలంటే పౌష్టికాహారం అందివ్వాలని హెచ్‌బీఎల్ సీఎస్‌ఆర్ జనరల్ మేనేజర్ హనుష్ సూరపనేని, కోఆర్డినేటర్ విజయలక్ష్మి అన్నారు. కూర్మన్నపాలెం, వడ్లపూడి, దువ్వాడ పరిధిలోని 15 అంగన్‌వాడీ కేంద్రాల (భగీరథ బాలల వికాస కేంద్రాలు) బాలలకు ఏడేళ్ల నుంచి దువ్వాడ వీఎస్‌ఈజెడ్ ఆవరణలోని హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ పౌష్టికాహారం అందిస్తుందన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాసాలమ్మ కాలనీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వస్తు సామగ్రి అందించారు. కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, ఎంఈవో ఎం.సునీత, హెచ్‌బీఎల్ సంస్థ ప్రతినిధులు సూర్యారావు, శ్రీకాంత్, ఉమాపతి, సంతోష్, ఎం.వి.సత్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రుకాషన పాల్గొన్నారు.

బెంగళూరు, అయోధ్యలకు రైళ్లు నడపాలి

అగనంపూడి: విశాఖపట్నం నుంచి నేరుగా బెంగళూరు, అయోధ్యలకు ప్రతీరోజూ రైళ్లు నడపాలని తూర్పు కోస్తా రైల్వే జోన్ యూజర్స్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. గతంలో విశాఖ నుంచి బెంగళూరుకు నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను భువనేశ్వర్‌కు తరలించుకుపోయారని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. విశాఖ నుంచి అందుబాటులో ఉన్న ఏకైక రైలు కూడా భువనేశ్వర్‌కు తరలించుకుపోవడంతో బెంగళూరు నేరుగా వెళ్లేందుకు రిజర్వేషన్లు దొరక్క ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే రిజర్వేషన్ 300 పైగా వెయిటింగ్ జాబితా ఉంటుందని, దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు రైలు సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. తక్షణమే స్పందించి విశాఖ నుంచి బెంగళూరు, అయోధ్య ప్రాంతాలకు రైళ్లు నడపాలని కోరారు.

పోరాటాలతో దిగివచ్చిన డెయిరీ యాజమాన్యం


కార్యక్రమంలో వివరాలను వెల్లడిస్తున్నసిటూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

అక్కిరెడ్డిపాలెం: కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేయడంతో విశాఖ డెయిరీ యాజమాన్యం పలు అంశాలను పరిష్కరించడానికి దిగివచ్చిందని సిటూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్.నర్సింగరావు అన్నారు. శుక్రవారం విశాఖ డెయిరీ వద్ద సీటూ నేతృత్వంలో డెయిరీ కార్మికుల సమస్యలపై చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు కొంత విరామం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్యం రెండు సంఘాలతో చర్చల అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామనడంతో నిరాహార దీక్షలకు కొంత విరామం ప్రకటించామన్నారు. కార్మికులకు వీక్లీ ఆఫ్‌లు, ప్రమోషన్ల అంశాన్ని కూడా పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటూ నాయకులు జి.రాంబాబు, మణి, ఎన్.రాజేంద్రప్రసాద్, ఎస్.రమణ, ఎ.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి


ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగులకు 2017 ఆర్‌పీఎస్ బకాయిలు పూర్తిగా చెల్లించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును కోరినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయనను ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ఆర్.సుబ్బారావు, ఎస్.రాజేష్‌కుమార్, జోనల్ కార్యదర్శి ఎ.రామారావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బస్ డ్రైవర్లు, కండక్టర్లకు నిలిపివేసిన నైట్ అవుట్ అలవెన్స్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావడానికి సహాయ సహకారాలు అందించిన ఎండీకి అసోసియేషన్ రాష్ట్ర కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఆర్‌పీఎస్ ఎరియర్స్ చెల్లింపులు మిగిలిపోయిన ఏపీపీడీలు, ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని కోరామన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఎండీ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

వాన.. హైరానా


చిత్తడిగా మారిన పెదగంట్యాడ రైతు బజార్


చెరువును తలపిస్తున్న దయాల్ నగర్ ప్రధాన రహదారి

- ఇబ్బందులు పడ్డ ప్రజలు
- మూతపడిన ఫుట్‌పాత్ దుకాణాలు
- హౌసింగ్‌బోర్డు కాలనీలో కూలిన మెట్ల మార్గం


గోతిలో నిలిచిన వర్షపు నీరు


చినఅక్కిరెడ్డిపాలెంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


బురదమయంగా అక్కిరెడ్డిపాలెం డెయిరీ కాలనీ రోడ్డు

పెదగంట్యాడ: వర్షం వణికించింది. మూడు రోజులుగా ఏకధాటిగా చిరుజల్లులు కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. రైతు బజార్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో అటు రైతులు, ఇటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. అసలే చలి దానికి తోడు గాలీ వర్షంతో ఇళ్ల నుంచి బయటకు రాలేక అవస్థలు పడ్డారు.

కూలిన మెట్ల మార్గం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో ఎల్‌ఐజీ బ్లాక్ లో ఓ పాత భవనం మొదటి అంతస్తు మెట్ల మార్గం కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటనపై సమాచారం అందుకున్న తహసీల్దార్ పి. అమల, జీవీఎంసీ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు.


మెట్లుకూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ అమల

హోరు గాలి.. జోరు వాన

అక్కిరెడ్డిపాలెం: ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి చలిగాలులు తోడవడంతో పలువురు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విధులకు వెళ్లే వారు, స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడ్డారు.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒకవైపు చలిగాలులు, మరోవైపు వర్షంతో వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.